క్లుప్తంగా

తహసీల్దార్‌కు సన్మానం



కేటీదొడ్డి: మండల నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన సరితారాణిని శుక్రవారం సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ఆంజనేయులు సన్మానించారు. నూతన తహసీల్దార్‌కు పూలబొకే అందించి, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో డీటీ శివశంకర్, సర్పంచులు గోపాల్‌యాదవ్, తిమ్మానాయక్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్ 2 వాయిదా వేయాలి

గట్టు: గ్రూప్ 2 పరీక్ష వాయిదా వేయాలని తీన్మార్ మల్లన్న టీం జిల్లా కోఆర్డినేటర్ కొమ్ముల ప్రవీణ్‌రాజ్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో డీఈఓకు ప్రవీణ్‌రాజ్ వినతి పత్రం సమర్పించారు. ప్రస్తుతం పోటీ పరీక్షలు వరుసగా ఉన్నాయని, నిరుద్యోగులకు పరీక్షలు రాసేందుకు ఇబ్బందులు ఏర్పడుతున్న నేపథ్యంలో గ్రూపు2 పరీక్ష వాయిదా వేయాలని కోరారు.

పాఠశాల ఆవరణం బురదమయం



ఉండవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఇటీవల కురిసిన వర్షాలకు బురదమయంగా మారింది. విద్యార్థినులు, ఉపాధ్యాయునులు బాత్‌రూంలకు వెళ్లాలంటే దారిలేక ఇబ్బందులు పడుతున్నారు. బురదలో వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. సమస్యను ప్రజాప్రతినిధులు, అధికారులు పరిష్కరించాలని కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండల పరిధిలోని ఉదండాపురం గ్రామానికి చెందిన పాస్టర్ హనోక్ తండ్రి ప్రకాష్ అకాల మరణం చెందాడు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ మందా శ్రీనాథ్ శుక్రవారం అక్కడికి వెళ్లి మృతదేహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రేపు చేనేత కళాకారుల సమ్మేళనం

గట్టు: చేనేత దినోత్సవం సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలో చేనేత కళాకారుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఆప్కో మాజీ డైరెక్టర్ దోమవీరన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చేనేత కళాకారులు చేనేత సహకార సంఘం నుంచి నేతాజీచౌక్ మీదుగా సంత బజారు వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి చేనేత కళాకారులు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు.

పరిశుభ్రతపై అవగాహన

అలంపూర్ రూరల్: మండలంలోని క్యాతూర్ పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం డ్రైడే సందర్భంగా పరిశుభ్రతపై సర్వే నిర్వహించారు. వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఇంటింటికి తిరిగి నీరు నిల్వ ఉన్న తొట్టీలు, గుంతలు, వంట గదులను పరిశీలించి ప్రజలకు సూచనలు, సలహాలను అందించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తుమ్మిళ్ల లిఫ్ట్ నీళ్లు విడుదల చేయాలి

శాంతినగర్: ఆర్డీఎస్ పరివాహక పొలాల్లో మిరప నాట్లు వేశామని, తుమ్మిళ్ల లిఫ్ట్ ఆన్ చేయించి నీటిని విడుదల చేయాలని ఎమ్మెల్యే అబ్రహంను ఆయా గ్రామాల రైతులు కోరారు. వడ్డేపల్లిలో వివిధ అభివృద్ధి పనులకు భూమిపూజ చేయడానికి వచ్చిన ఎమ్మెల్యేను శాంతినగర్‌లో రైతులు కలిశారు. తుమ్మిళ్ల లిఫ్ట్ నీటిని విడుదలచేస్తే ఆర్డీఎస్ ఆయకట్టు రైతులకు న్యాయం జరుగుతుందని కోరారు. ఆర్డీఎస్ అధికారులతో మాట్లాడి నీటిని విడుదల చేయించేందుకు కృషిచేస్తానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

వాహనాలకు భద్రత కరువు



ఉండవెల్లి: మండలంలోని జోగుళాంబ హాల్ట్ వద్ద చెట్టుకింద ఏర్పాటు చేసిన పార్కింగ్ వాహనాలకు భద్రత లేదని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థలం లేక చెట్టు కిందనే పార్కింగ్ ఏర్పాటు చేసి, డబ్బులు కూడా వసూలు చేస్తున్నారు. ద్విచక్ర వాహనాల పార్కింగ్ పెరిగిపోయి స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారు. పార్కింగ్‌కు సరైన స్థలం కేటాయించి, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

గ్రామాల్లో నిఘానేత్రం

- నిఘా నేత్రాల ఏర్పాటు
- అవగాహన కల్పిస్తున్న పోలీసులు
- స్వచ్ఛందంగా దాతల సహాయం..



ఎర్రవల్లి కూడలిలో సీసీ కెమెరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్పీ (ఫైల్)



ఎర్రవల్లి కూడలిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

ఎర్రవల్లిచౌరస్తా: ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమని పోలీసులు చేస్తున్న ప్రచారం రోజు రోజుకూ సత్ఫలితాలను ఇస్తోంది. పల్లెల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొస్తున్నారు. అలంపూర్ నియోజకవర్గంలో మొదటగా 38 గ్రామ పంచాయతీల్లో అక్కడక్కడ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లో దాతల సహకారంతో ప్రధాన కూడళ్ల వద్ద, జన సంచారం అధికంగా ఉన్న ప్రదేశాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. పల్లెల్లో నేరాల నియంత్రణకు సీసీకెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పల్లెల్లో నిరంతరం నిఘా ఉంటుందని ప్రజలు పేర్కొంటున్నారు. గ్రామాలకు అపరిచిత వ్యక్తులొచ్చినా వారి కదలికలను నేరుగా సీసీ పుటేజీల ద్వారా గుర్తించేందుకు సీసీ కెమెరాల ద్వారా వీలుంటుందని పలువురు తెలుపుతున్నారు.

ముమ్మరంగా పోలీసుల ప్రచారం..

నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలతో కలిగే ప్రయోజనాలపై గ్రామస్తులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు కలిసి దాతల సహాయంతో ప్రధాన కూడళ్ల, జన సంచారం ఉండే ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తున్నారు. నియోజకవర్గంలో 124 గ్రామాలుండగా, ఇప్పటికే 38 పంచాయతీల్లో విరాళాలతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 42 గ్రామ పంచాయతీల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావడంతో పనులు సాగున్నాయి. మిగిలిన 44 గ్రామ పంచాయతీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు.

తగ్గనున్న నేరాలు..

గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుతో నిరంతరం పర్యవేక్షణ ఉంటుంది. గ్రామాల్లో జరిగే నేరాలు తగ్గుముఖం పడతాయి. ప్రస్తుతం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన గ్రామాలను ఆదర్శంగా తీసుకొని మిగతా గ్రామాలు ప్రజలు ముందుకు రావాలని పోలీసులు కోరుతున్నారు. నియోజకవర్గంలోని ఆయా మండలాల వారీగా గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల వివరాలు ఇలా..

మండలం	జీపీలు	కెమెరాల ఏర్పాటు	పనులు జరుగుతున్నవి
ఇటిక్యాల	29	8	9
మానపాడు	16	5	6
అలంపూర్	14	4	5
ఉండవెళ్ళి	16	5	4
రాజోలి	11	5	5
వడ్డేపల్లి	10	4	4
అయిజ	28	7	9

గ్రామస్తుల చొరవతో ఏర్పాటు చేశాం



పోలీసుల విజ్ఞప్తి మేరకు వ్యాపారులు, గ్రామస్తులు కలిసి విరాళాలు అందించడంతో గ్రామ పంచాయతీలో అక్కడక్కడ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. గ్రామంలోని ప్రధాన కూడలితో పాటు జన సంచారమున్న ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలలో గ్రామ పంచాయతీ నుంచి నేరుగా వీక్షించవచ్చు. నేరాల నియంత్రణకు, జాతీయ రహదారిపై జరిగే ప్రమాదాలను నేరుగా గుర్తించేందుకు అవకాశం ఉంటుంది.

– జోగుల రవి, సర్పంచ్, ఎర్రవల్లి పంచాయతీ

దాతలు ముందుకు రావాలి..



గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణ, నేరాలు అదుపు చేయడం కోసం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయిస్తున్నాం. ఆయా గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలి. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసిన గ్రామాల్లో నిరంతరం పోలీసుల నిఘా నేరుగా ఉన్నట్లే. గ్రామాల్లో జరిగే ప్రతి నేరాన్ని పూర్తి సాక్ష్యాలతో తెలుసుకొని దోషులను గుర్తించేందుకు సులభంగా వీలుంటుంది. జనసంచార ప్రాంతాల్లో జరిగే ప్రధాన నేరాలు, రోడ్డు ప్రమాదాలు, దోపిడీలు జరిగినప్పుడు సీసీ పుటేజీలు ఎంతో కీలకంగా పనిచేస్తాయి.

– రాజు, సీఐ, అలంపూర్

మరమ్మతులు పటిష్టంగా ఉండాలి



పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ మనోరమ

అలంపూర్: పట్టణంలో జరుగుతున్న పైప్ లీకేజీ మరమ్మతు పనులు పటిష్టంగా చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ కాంట్రాక్టర్‌కు సూచించారు. పట్టణంలో డివైడర్ విత్ లైటింగ్ పనులు జరుగుతున్న నేపథ్యంలో రోడ్డును తవ్వినప్పుడు మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలి లీకేజీ అయింది. వాటికి మరమ్మత్తులు నిర్వహిస్తున్న సందర్భంగా శుక్రవారం ఆమె పనులను పరిశీలించారు. రోడ్డు వేశాక దాని కింద ఉన్న పైప్‌లు లీకేజీ కాకుండా, భవిష్యత్‌లో ఇబ్బందులు రాకుండా పటిష్టంగా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలోవైస్ చైర్మన్ శేఖర్‌రెడ్డి, కౌన్సిలర్ సుదర్శన్‌గౌడ్, రాజశేఖర్, మురళీధర్ రెడ్డి, జయలక్ష్మి, లక్ష్మీదేవమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బాలికలు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

మల్దకల్ : బాలికలు ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ జయమ్మ సూచించారు. శుక్రవారం మల్దకల్ కస్తూర్బా బాలికల పాఠశాలలో బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని పాఠశాల, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలన్నారు. బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మల్దకల్‌లో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ జయమ్మ

లక్ష్యం మేరకు మొక్కలు నాటాలి



మొక్కలను నాటుతున్న కూలీలు

మల్దకల్: ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో వెయ్యి హరితహారం మొక్కలు నాటాలని ఎంపీడీఓ కృష్ణయ్య పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని అమరవాయిలో రోడ్డుకు ఇరువైపుల మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని కోరారు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే రైతులు, ప్రజలకు ఇబ్బంది లేకుండా పనులు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మమ్మ, ఎంపీటీసీ గోపాల్‌రెడ్డి, ఎంపీఓ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రెగ్యులరైజ్ చేసేందుకు సహకరించాలి

గద్వాల అర్బన్: బాలల పరిరక్షణ విభాగంలోని సిబ్బందిని రెగ్యులరైజ్ చేసేందుకు సహకరించాలని తెలంగాణ నాన్ గెజిటెడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాగర్జునగౌడ్, రాష్ట్ర కార్యదర్శి భీమన్న, జిల్లా సెక్రటరీ ఆనంద్‌లకు శుక్రవారం డీసీపీయూ సిబ్బంది శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. తమ సమస్యలను పరిష్కరించి రెగ్యులరైజ్ చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వారిని కోరారు.



వినతిపత్రం అందజేస్తున్న డీసీపీయూ సిబ్బంది

'గృహలక్ష్మి'కి భారీగా దరఖాస్తులు

గట్టు: గృహలక్ష్మి కోసం లబ్ధిదారుల దరఖాస్తులు పెరుగుతున్నాయి. లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఇంటి నిర్మాణం కోసం రూ.3 లక్షల ఆర్థిక సాయం అందజేయనున్న నేపథ్యంలో మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. వివిధ గ్రామాల నుంచి లబ్ధిదారులు పెద్ద ఎత్తున దరఖాస్తులు సమర్పిస్తున్నారు. ఇప్పటి దాకా 1887 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ చెన్నయ్య తెలిపారు.

873 దరఖాస్తుల స్వీకరణ

అలంపూర్ రూరల్: అలంపూర్ మున్సిపాలిటీ, మండల పరిధి గ్రామాల నుంచి గృహలక్ష్మి కోసం 873 దరఖాస్తులు వచ్చినట్లు శుక్రవారం ఎంపీడీఓ గోవిందరావు, మున్సిపల్ కమిషనర్ నిత్యానంద్ తెలిపారు. అలంపూర్ మున్సిపాలిటీ నుంచి 96, మండలంలోని గ్రామాల నుంచి 777 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.



మీసేవ కేంద్రాల్లో కిక్కిరిసిన దరఖాస్తుదారులు

గృహలక్ష్మికి 2736 దరఖాస్తులు

కేటీదొడ్డి: ప్రభుత్వం ప్రకటించిన గృహలక్ష్మికి పథకానికి కేటీదొడ్డి మండలంలోని 2736 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ మహ్మద్ అజార్ మోహిద్దీన్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించినట్లు వారు తెలిపారు.

పశువులకు టీకాలు తప్పనిసరి

ఎర్రవల్లిచౌరస్తా: పశువులలో వచ్చే గాలి కుంటు, ముద్ద చర్మ వ్యాధుల నివారణ కోసం ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న టీకాలను ప్రతి పశువుకీ తప్పకుండా వేయించాలని మండల పశువైద్యాధికారి భువనేశ్వరి అన్నారు. శుక్రవారం ఇటిక్యాలంలోని ఉదండాపురం, కోదండాపురం, యాక్తాపురం గ్రామాలలో గాలి కుంటు, ముద్ద చర్మ వ్యాధుల నివారణ కోసం పశువులకు వైద్య సిబ్బందితో కలిసి టీకాలు వేశారు. ఈ నెల మొదటి నుంచి 28 వరకు మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో పశువైద్య సిబ్బంది పశువులకు టీకాలు వేస్తామన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది రామకృష్ణ, భాస్కర్, తదితరులు ఉన్నారు.

అయిజ: గాలికుంటు వ్యాధి రాకుండా ఉండేందుకు ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసిన టీకాలను రైతులు పశువులకు వేయించాలని వెటర్నీ అసిస్టెంట్ సర్జన్ స్వరూపరాణి కోరారు. శుక్రవారం ఉత్తనూరు, కిష్టాపురంలో ఆవులు, గేదెలు, ఎద్దులు మొత్తం 88 పశువులకు గాలి కుంటు వ్యాధి నిరోధక టీకాలు వేసినట్లు తెలిపారు. సెప్టెంబర్ 1వ తేదీ వరకు టీకాలు వేస్తారని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

షరతుల్లేకుండా రుణమాఫీ చేయాలి

ఎర్రవల్లిచౌరస్తా: 2014 నుంచి 2023 వరకు రైతులు తీసుకున్న పంట రుణాలకు ఎలాంటి షరతుల్లేకుండా రుణమాఫీ చేయాలని ఇటిక్యాల కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రుక్మాందర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం 2018 వరకు తీసుకున్న రుణాలను మాత్రమే మాఫీ చేస్తామని మెలిక పెట్టి రైతులను మరోసారి మోసం చేస్తుందన్నారు. షరతుల్లేకుండా బ్యాంకుల్లో ఉన్న అసలు, వడ్డీని పూర్తిగా మాఫీ చేయాలని కోరారు.

మాజీ ఎమ్మెల్యే కృషితోనే నీటి విడుదల

ఎర్రవల్లిచౌరస్తా: ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ కృషితోనే జూరాల కుడి కాల్వకు అధికారులు నీటిని విడుదల చేశారని అలంపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జోగుల రవి అన్నారు. శుక్రవారం ఇటిక్యాల మండలంలోని మునుగాల సమీపంలో కుడి కాల్వను సందర్శించి కాల్వలో పారుతున్న నీటిని ఆయన పరిశీలించారు. గత కొంత కాలంలో కుడి కాల్వకు నీరు లేక రైతులు తీవ్ర ఇబ్బందులకు గురైనట్లు తెలిపారు. ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ ఈ నెల 8న రైతులతో కలిసి కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించినట్లు పేర్కొన్నారు. దీనికి స్పందించిన కలెక్టర్, అధికారులు మూడు రోజుల్లో విడుదల చేస్తామని హామీ ఇచ్చి కుడి కాల్వకు నీటిని విడుదల చేసినట్లు తెలిపారు.

పథకాలు సద్వినియోగం చేసుకోండి

శాంతినగర్: కేంద్ర ప్రభుత్వం పేదల కోసం చేపడుతున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రాజగోపాల్ తెలిపారు. వడ్డేపల్లి మండలంలోని తనగలలో నరేంద్ర మోదీ తొమ్మిదేళ్ల పాలనలో చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నరసింహులు, రంజిత్‌పటేల్, నరేష్, సూర్యనారాయణ, ఆంజనేయులు పాల్గొన్నారు.

పేదలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

అయిజ: వివిధ సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అండగా ఉందని అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ముందు 124 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కల్యాణ లక్ష్మి పథకం పేదలకు వరమని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నాయీ బ్రాహ్మణ సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు కావడంతో మంజూరు పత్రాన్ని నాయీ బ్రాహ్మణుల సంఘం నాయకులకు అందజేశారు. కార్యక్రమంలో కార్యక్రమంలో తహసీల్దార్ సహీదా బేగం, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

పల్లెల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ఎర్రవల్లిచౌరస్తా: పల్లెల్లో మౌలిక సదుపాయాలు కల్పించి అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ధ్యేయమని అలంపూర్ ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం అన్నారు. శుక్రవారం ఇటిక్యాల మండలంలోని చాగాపురంలో రూ.24లక్షల వ్యయంతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ప్రొసిడింగ్ కాపీలను అందజేశారు. గ్రామంలో రూ.9లక్షలతో 33కేవీ కరెంట్ లైన్ మార్పిడి, రూ.10లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం, రూ.5లక్షలతో పెద్దవాగు బ్రిడ్జి నిర్మాణం కోసం ఎమ్మెల్యే భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కాంగ్రెస్ పాలనలో ప్రజల ఆకలి చావులు అధికంగా ఉండేవన్నారు. ప్రస్తుతం బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కూడా ప్రజలు అష్ట కష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజల అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. పల్లెలు అభివృద్ధి చేయడం కోసం బీటీ రోడ్లు, అంతర్గత సీసీ రోడ్లను ఏర్పాటు చేసిందన్నారు. గ్రామాల్లో చేపట్టిన పనులను నాణ్యతగా చేపట్టి సకాలంలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే కాంట్రాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు ఉన్నారు.

'ఆత్మ' ఉద్యోగులకు భరోసా ఇవ్వండి



మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆత్మ ఉద్యోగులు

అయిజ: ఆత్మ (వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ) ఉద్యోగుల కుటుంబాలకు భరోసా ఇవ్వాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను తెలంగాణ రాష్ట్ర ఆత్మ అసోసియేషన్ వైస్ ప్రసిడెంట్ నీలాద్రి శ్రీకాంత్, జనరల్ సెక్రెటరీ సురేందర్‌రెడ్డిలు కోరారు. శుక్రవారం మహబూబ్ నగర్‌లో మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2005 సంవత్సరం నుంచి వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థలో కాంట్రాక్టు ఉద్యోగులుగా పనిచేస్తున్నా ఇప్పటి వరకు వారికి ప్రభుత్వం ఎలాంటి భరోసా ఇవ్వలేదన్నారు. సీఎం కేసీఆర్ దృష్టికి ఆత్మ ఉద్యోగుల సమస్యను మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో ఆత్మ సురేష్, మదన్ మోహన్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించండి

అయిజ: సీసీ రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీలోని 8వ వార్డు భరత్‌నగర్ కాలనీలో సీసీ రోడ్డు పనులను చేపట్టారు. ఈసందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడారు. పట్టణంలోని ప్రధాన రోడ్డు కావడంతో ప్రజలు ఎక్కువగా ప్రయాణిస్తుంటారని, ట్రాఫిక్ జామ్ అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, నిర్మాణం పనులు త్వరగా పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న, వైస్ చైర్మన్ మాల నరసింహులు, ఏఈ గోపాల్, వార్డు కౌన్సిలర్ సరళ పావని పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులు పరిశీలిస్తున్న అధికారులు

నాటిన మొక్కలను రక్షించుకోవాలి



వైకుంఠధామంలో మొక్కలను నాటుతున్న ఎంపీపీ, సర్పంచ్

అలంపూర్ రూరల్: నాటిన మొక్కలకు నీళ్లు పోసి నాటిన ప్రతి మొక్కనూ కాపాడుకోవాలని ఎంపీపీ చంద్రకళ అన్నారు. మండలంలోని భీమవరంలోని వైకుంఠధామంలో ఆజాదికా అమృత్ మహోత్సవంలో భాగంగా 'మెరి మట్టి-మేరిదేశ్'కు సంబంధించి 75 మొక్కలు నాటారు. ఆమెతో పాటు సర్పంచ్ ఎల్లమ్మ ఉన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక



అమరవాయిలో బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు

మల్దకల్: మండలంలోని అమరవాయికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు శుక్రవారం గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ చేపడుతున్న వివిధ సంక్షేమ పథకాలను, అభివృద్ధిని చూసి వివిధ పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాజారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సీతారామిరెడ్డి, తిమ్మారెడ్డి, గోపాల్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, తిమ్మప్ప, రంగన్న, మహేష్, కిష్టన్న పాల్గొన్నారు.

జోరుగా.. సాగు

- వానాకాలంలో ఆశించిన స్థాయిలో వర్షాలు
- వ్యవసాయ పనుల్లో రైతులు బిజీబిజీ



గట్టు శివారులో వరినాట్లు వేస్తున్న కూలీలు

గట్టు: ముంగారి సేద్యం పనులు జోరందుకున్నాయి. వరుణుడి కరుణతో రైతులు పంటల సాగులో తలమునకలయ్యారు. 'జోరుగా హుషారుగా సాగి పోదమా..'అన్నట్లుగా వరుణుడి జోరుతో పంటల సాగులో రైతులు బిజీబిజీగా మారారు. గతేడాదితో పోల్చుకుంటే ఈ సారి దాదాపుగా నెలన్నర రోజులు ఆలస్యంగా వర్షాలు కురిశాయి. అల్పపీడనం(జూలై చివరి వారం) తర్వాత కొంత విరామం తీసుకున్న తర్వాత మళ్లీ వర్షాల కురువడంతో రైతులు పొలం పనుల్లో బిజీగా మారారు. వేరుశనగ, గొర్రవరి, ఆముదం, కందులు, కమర్షియల్ పత్తి విత్తనాలను రైతులు ఇప్పటికే నాటుకున్నారు. వర్షాలు ఆలస్యమైనప్పటికీ రెండు రోజుల క్రితం కురిసిన వర్షం రైతులకు ఎంతో మేలైంది. ఇప్పటికే నాటిన పత్తి పొలాల్లో రైతులు కలుపు నివారణ చర్యలు చేపడుతున్నారు. నెట్టెంపాడు ప్రాజెక్టులో భాగంగా ర్యాలంపాడు రిజర్వాయర్ ద్వారా కాలువలకు నీటి విడుదల కావడంతో వరిసాగు జోరు మరింత ఊపందుకుంది. వానలు ఆలస్యమైనప్పటికీ ఈ సారి ముంగారి సేద్యం పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు.